వరద ఉధృతిని పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే

- సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- భోజనంతోపాటు సౌకర్యాలు కల్పించిన అధికారులు
- ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే
- పొంగిపొర్లుతున్న కొండవీటి వాగు



ముంపునకు గురైన నిర్వాసితులకు భోజనం అందిస్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది

తాడేపల్లిరూరల్: ప్రకాశం బ్యారేజ్ వద్ద వరద ఉధృతిని గురువారం ఉదయం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) నగర పాలక సంస్థ అధికారులతో కలసి పరిశీలించారు. కృష్ణానదికి వస్తున్న వరదనీటి వివరాలను ఎమ్మెల్యే ఆర్కే అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కృష్ణానది ప్రకాశం బ్యారేజ్ వద్ద వరద నీరు వచ్చి చేరుతోందని, ఎగువ ప్రాంతంలో వర్షాలు కురవడం వల్ల 70 నుంచి 80 వేల క్యూసెక్కుల వరద నీరు దిగువ ప్రాంతానికి వదులుతున్నారని, వర్ష ప్రభావం తగ్గితే వరద ఉధృతి తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పర్యాటకులను నదిలో దిగకుండా నగర పాలక సంస్థ అధికారులు, పోలీసులు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. త్వరలోనే కృష్ణానదిలో ప్రమాదాలను నివారించేందుకు కార్పొరేషన్ తరఫున శాశ్వత చర్యలు చేపట్టే విధంగా చర్యలు సిద్ధం చేస్తున్నామని, అందుకు సాధ్యాసాధ్యాలపై సంయుక్త సమావేశం నిర్వహించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ శారదాదేవి, డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, వైఎస్సార్ సీపీ ఎస్టీ, బీసీ సెల్ అధ్యక్షులు బాలసాని అనీల్, బత్తుల దాసు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణానది దిగువ ప్రాంతంలోని పుష్కర ఘాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు

మంగళగిరి: వాయుగుండం ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంగళగిరి పట్టణంలోని రత్నాలచెరువు ప్రాంతంలో ఉన్న సూర్య నారాయణ నగర్, ఎస్టీ కాలనీలు ముంపు బారిన పడ్డాయి. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) గురువారం ఆ ప్రాంతాలను పరిశీలించి ముంపునకు గురైన నివాసాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వారికి భోజనంతోపాటు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని నగర పాలక సంస్థ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ముంపు ప్రాంతాల్లోని నీరు వెంటనే బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆర్కే అధికారులకు సూచించారు. ఇటీవల ఎమ్మెల్యే ఆర్కే చొరవతో రోడ్ల నిర్మాణంతో చాలావరకు ముంపు సమస్య తప్పిందని స్థానికులు తెలిపారు. ఔట్‌ఫాల్ డ్రెయిన్ పూడికతీత పనులు వెంటనే చేపట్టి భవిష్యత్తులో నివాసాలు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరుకొండ పొలాల్లో కొండవీటి వాగు పొంగి పొర్లి వరదనీరు ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వద్దకు చేరింది. కార్యక్రమంలో తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్, డీఈ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

మండల పరిషత్ సమావేశంలో సర్పంచులు వినతి



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

ఫిరంగిపురం: విద్యుత్ సమస్యలు పరిష్కరించాలంటూ గొల్లపాలెం, ఫిరంగిపురం గ్రామాల సర్పంచులు మేడాబాబు, డి.మెల్కియాలు కోరారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ షేక్.షహేలానర్గీస్ అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని కోరడంతో దానికి ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీచైర్మన్ కత్తెర హెనీక్రిస్టినా, సమన్వయకర్త సురేష్‌కుమార్ చొరవ తీసుకొని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకొచ్చారంటూ ఎంపీడీవో అనూరాధ తెలిపారు. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి

గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. సమావేశంలో సురేష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఇందుకోసం అధికారులు ఎన్ని ఇబ్బందులు, సమస్యలు వచ్చినా వాటిని అధిగమించి ప్రజలకు మరింతగా సేవలు అందించాలని కోరారు. రేపూడి, 113తాళ్లూరు గ్రామాల్లో తాగునీటికి ఇక్కట్లు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని ఆయా గ్రామాల నాయకులు చిట్టా అంజిరెడ్డి, చేవూరి రామమోహన్‌రెడ్డి కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, వైస్ ఎంపీపీలు ఎం.విజయలక్ష్మి, డి.చంద్రం, తహసీల్దార్ పద్మనాభుడు, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పలు గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి కలాంకు నివాళులు



మాజీ రాష్ట్రపతి డాక్టర్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యార్డు చైర్మన్ షేక్ బాజీ

తాడేపల్లిరూరల్: భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంకు పలువురు నివాళులర్పించారు. దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డులో గురువారం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. యార్డు చైర్మన్ షేక్ బాజీ అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శృంగారంపాటి రత్నం, షేక్ జానీ బాషా, షేక్ సలీం, ఉప్పాల సుబ్బారావు, తాడిబోయిన వెంకటనారాయణ, షేక్ అబ్దుల్ నజీర్, ఎండీ బాజీ, ఉన్నం రాజేష్, నూతక్కి కోటేశ్వరరావు, తాడిబోయిన వెంకటరావు, ఎండీ సాధిక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ కో ఆప్షన్ సభ్యుల ఆధ్వర్యంలో.....

దుగ్గిరాల ఆలీనగర్‌లో మాజీ కో ఆప్షన్ సభ్యుల ఆధ్వర్యంలో భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్ వర్ధంతి గురువారం నిర్వహించారు. అబ్దుల్ కలామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు గయాసుద్దవుల, జూపూడి జాన్సన్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో ఎండీ బాజీ షహీద్, షేక్ నాగూర్, జున్ను ఖాస్, షేక్ కరీముల్లా, ఎండీ మహబులే, ఎండీ మొహిద్దీన్, యాహుబ్ పాల్గొన్నారు.

కిసాన్ సమ్మాన్ నిధి రైతులకు పెన్నిధి

బీజేపీ రాష్ట్ర నాయకురాలు సాదినేని యామినిశర్మ

పొన్నెకల్లు(తాడికొండ): కిసాన్ సమ్మాన్ నిధి రైతులకు పెన్నిధి అని బీజేపీ రాష్ట్ర నాయకురాలు సాదినేని యామిని శర్మ అన్నారు. గురువారం 14వ విడత కిసాన్ సమ్మాన్ నిధి రైతుల ఖాతాలలో జమ, పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాల ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రధాని వర్చువల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొని సందేశాన్ని విన్న అనంతరం రైతులకు యూరియా అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాల ద్వారా దేశంలోని లక్ష ఎరువుల దుకాణాలు ఇప్పటికే మోడల్ ఫర్టిలైజర్ వన్ స్టాప్ కేంద్రాలుగా మార్పు చేయడం జరిగిందన్నారు. డిసెంబర్ లోపు మరో 1.8 లక్షల కేంద్రాల ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు సరసమైన ధరలకు రాయితీపై అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేఎల్‌యూలో ఉస్తాద్ చిత్ర బృందం సందడి



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో గురువారం కేఎల్ ఫిల్మ్ క్లబ్ ఆధ్వర్యంలో ఇట్స్ షో టైమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉస్తాద్ చిత్ర బృందం విచ్చేసి విద్యార్థులను ఉత్సాహపర్చింది. సాక్ డైరెక్టర్ సాయి విజయ్ మాట్లాడుతూ ఇట్స్ షో టైమ్ అనే కార్యక్రమం వలన విశ్వవిద్యాలయం శక్తివంతమైన చలన చిత్ర సంస్కృతిని ప్రదర్శించిందని అన్నారు. అత్యంత ప్రశంసలు పొందిన వారాహి చలనచిత్రం ఉస్తాద్ కథానాయకుడు ఫణిదీప్, కథానాయికి కావ్య కళ్యాణి రామ్‌లు విద్యార్థులు రూపొందించిన లఘు చిత్రాలను వీక్షించారు. యూనివర్సిటీలోని ప్రతిభావంతులైన విద్యార్థులు రూపొందించిన షార్ట్ ఫిల్మ్‌లు, డాక్యుమెంటరీలు, ఇతర సినిమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి విభాగ సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, ఫిలిం క్లబ్ మెంటార్ వేణు, సాక్ విద్యార్థుల మెంటార్లు పి.వి.సత్యనారాయణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మట్టి ఖర్చులు అందజేత



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాకకు చెందిన మాదాని జయరామ్(47) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. వలంటీర్ ద్వారా సమాచారం అందుకున్న పెనుమాక సచివాలయం-2 డిజిటల్ అసిస్టెంట్ నరేష్ వైఎస్సార్ బీమా కింద పేరు నమోదు చేసి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పెనుమాక అధ్యక్షులు దామేష్‌రెడ్డి, ఎస్సీ విభాగం జిల్లా నాయకులు బొక్కా ప్రసన్న (నాని), పెనుమాక గృహసారథుల జేసీఎస్ కన్వీనర్లు అన్నూరు సుబ్బారావు, పులి భుజంగరావు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

తాడేపల్లిరూరల్: వారం రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న అధిక వర్షాల కారణంగా తాడేపల్లి పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో కోరారు. వర్షం నీరు నిలిచిపోవడంతో దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అధికారులు త్వరగా నీటిని బయటకు పంపాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తాడేపల్లిరూరల్: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు అన్నారు. గురువారం చిర్రావూరు గ్రామంలో రైతు సంఘం నాయకులతో కలసి ముంపునకు గురైన వరి పొలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు చిర్రావూరు గ్రామంలో సుమారు 170 ఎకరాల్లో వరిపైరు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ఒక్కో ఎకరానికి రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు ఖర్చు అయ్యాయని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.5 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంట పొలాలకు ఇరువైపులా ఉన్న మురుగు కాలువలను పూడిక తీయించి పంట పొలాలు ముంపునకు గురికాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం చిర్రావూరులోని రైతు భరోసా కేంద్రం అధికారిని ఎస్.శాంతిశ్రీని కలసి వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పల్లె కృష్ణ, పరిమిశెట్టి శివనాగేశ్వరరావు, ఎం.పాములు, పల్లపాటి సుబ్బారావు, నారంశెట్టి బిక్షాలరావు ఉన్నారు.

జగనన్న సురక్షతో అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి

ఎమ్మెల్సీ మురుగుడు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, ఆప్కో చైర్మన్ చిరంజీవి

మంగళగిరి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. నగరంలోని గౌతమ బుద్ధా రోడ్డు వెంట ఉన్న సీఎస్ఆర్ కల్యాణ మండపం, అంజుమన్ షాదీఖానాల్లో గురువారం మార్కేండేయ కాలనీ, టిప్పర్లబజార్, పెదవడ్లపూడి సచివాలయాల పరిధిలోని ప్రజలకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిలు పాల్గొని లబ్ధిదారులకు పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, సేవలు అర్హులందరికీ అందించాలని, వివిధ కారణాలతో మిగిలిపోయిన లబ్ధిదారులకు మంచి చేయడం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. పేద వారికి మంచి జరగాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, లంచాలకు తావు లేకుండా కుల, మత, రాజకీయాలకు తావు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుని జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉచితంగా 11 రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ హేమమాలిని, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఆర్ఐ బాబూరావు, తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్, ఈవోఆర్డీ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ మహ్మద్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయండి

మంగళగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 16వ తేదీ నుంచి సెప్టెంబరు 6వ తేదీ వరకు సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ కోరారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ వ్యవసాయాన్ని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు చిన్ని తిరుపతయ్య, యార్లగడ్డ గోపి తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేట పంప్‌హౌస్‌లో వాటర్ సంపు మరమ్మతుల నిమిత్తం శుక్రవారం తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ శారదాదేవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నులకపేట, బ్రహ్మానందపురం, డ్రైవర్ కాలనీ, శివదుర్గాపురం, డోలాస్‌నగర్ సచివాలయాల పరిధిలో తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నామని, తిరిగి సాయంత్రం 3 గంటలకు ప్రాంతాల వారీగా తాగునీటిని సరఫరా చేస్తామని, ప్రజలందరూ కార్పొరేషన్ వారికి సహకరించాలని కోరారు.

తగ్గుతున్న వరద నీరు



పత్తి పంట పొలంలో తగ్గిన వరద నీరు

తాడికొండ: బుధవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో వరద ఉధృతి శాంతించింది. పంట పొలాల్లో వరద నీరు తగ్గుతుండటంతో రైతులు పంటను కాపాడుకునేందుకు నీటిని బయటకు మళ్లించే పనిలో పడ్డారు. గురువారం వరుణుడు శాంతించడంతో రైతులు కొంత ఊపిరి పీల్చుకున్నప్పటికీ మరో మూడు రోజులు భారీ వర్షాలు చెబుతున్న నేపథ్యంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మసీదుకు రూ.లక్ష విరాళం



మసీదు నిర్మాణానికి రూ.లక్ష విరాళాన్ని అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి: నగర పరిధిలోని బాపనయ్యనగర్‌లో ఉన్న ఫాతిమా మసీదు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రూ.లక్ష విరాళం అందజేశారు. ముస్లిం పెద్దలు గురువారం ఎమ్మెల్యే ఆర్కేను కలసి మసీదు నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని కోరగా వెంటనే స్పందించిన ఆయన రూ.లక్ష విరాళాన్ని ప్రకటించి వైఎస్సార్ సీపీ నాయకుల చేతుల మీదుగా మసీదు కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు ఇక్బాల్ అహ్మద్, షేక్ హన్నన్, అక్బర్ అలీ, అష్రాఫ్ ఖాన్ (అషోక్) మసీదు నిర్వాహకులు పాల్గొన్నారు.

సీతారామ కోవెల షెడ్డు నిర్మాణానికి రూ.లక్ష విరాళం

పాత మంగళగిరి సీతారామకోవెల ఆవరణలో నూతనంగా నిర్మించతలపెట్టిన షెడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆర్కే రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఇటీవల ఆలయ కమిటీ సభ్యులు షెడ్డు నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేయాలని ఎమ్మెల్యే ఆర్కేను కలసి కోరారు. గురువారం పార్టీ నాయకుల చేతుల మీదుగా రూ.లక్ష విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

నగరంలోని ఇందిరానగర్‌కు చెందిన రాధా కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తోట శ్రీనివాసరావు, దొడ్డక కృష్ణ, తాడిబోయిన సురేష్, తోట సాంబ, చిన్ని రామారావు, చింతా మహేష్, రుద్రు వినయ్, యర్రాకుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: సీతానగరంలోని పుష్కరఘాట్ల వద్ద నివాసముండే కారుగోలు చెంచయ్య (40) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్టీ విభాగం పట్టణ అధ్యక్షులు బాలసాని అనీల్, బీసీ విభాగం అధ్యక్షుడు బత్తుల దాసు, వైఎస్సార్ సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి చిలుకోటి మధు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు సీహెచ్ రంగారావు తదితరులు ఉన్నారు.

అంత్యక్రియలకు సాయం

దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులో అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందిన డేగల సామ్రాజ్యం అంత్యక్రియల నిమిత్తం ఎమ్మెల్యే ఆర్కే రూ.10వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, సర్పంచ్ ఉన్నం ఝాన్సీలు గురువారం ఆ మొత్తాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు షేక్ సుభాని, కంఠంరాజు కొండూరు గ్రామ సచివాలయ కన్వీనర్ కావూరి అశోక్, పంచాయతీ బోర్డు సభ్యులు డి.వీర వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఓపీ కౌంటర్లకు శంకుస్థాపన



ప్లాస్టిక్ సర్జరీ వైద్యులను అభినందిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్ అవుట్ పేషెంట్ విభాగంలో (ఓపీ) రోగుల పేర్లు నమోదు కోసం నూతనంగా ఏర్పాటు చేయనున్న 10 కేంద్రాలకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ గురువారం ప్రత్యేక పూజలు చేసి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ జీజీహెచ్ ఓపీ విభాగానికి ప్రతిరోజూ రెండు వేల నుంచి మూడు వేల మంది వరకు రోగులు రావడంతో కిటికిటలాడుతోందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆరు ఓపీ పేర్ల నమోదు కౌంటర్లు సరిపోకపోవడంతో మరో 10 ప్రారంభించాలని భావించినట్లు చెప్పారు. ఈ కేంద్రాలు అందుబాటులో వస్తే రోగులకు ఉపయోగం కలుగుతుందని తెలిపారు. ఆసుపత్రిలో పనిచేసే ఉద్యోగి శివారెడ్డి రూ.5వేలు ప్రకటించడం సంతోషకరమని పేర్కొన్నారు. డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్. శ్రీనివాస ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ కిరణ్మయి, ఇంజినీరింగ్ అధికారులు రత్తయ్య, సత్యం పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి రెండేళ్లుగా రోగి పడుతున్న సమస్యల్ని తొలగించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ గురువారం వైద్యుల్ని అభినందించారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు స్వర్ణభారతీనగర్‌కు చెందిన జె.నాగరాజు రెండేళ్ల కిందట కోవిడ్‌కు గురైనట్లు తెలిపారు. కోలుకున్న తర్వాత బ్లాక్ ఫంగస్ సోకి దంత సమస్యలు ఏర్పడటంతో అనేక ఇబ్బందులకు గురయినట్లు వెల్లడించారు. ఆహారం మింగలేకపోవడం, మాట సరిగా రాకపోవడంతో అవస్థలకు గురైనట్లు పేర్కొన్నారు. రోగి చేతి నుంచి కండ తీసి పై దవడ, ముఖంలో రక్తనాళాల్ని కలిపి మైక్రో సర్జరీ ద్వారా రెండేళ్ల సమస్య నుంచి విముక్తి కల్పించారని వివరించారు.

తాడికొండలో చేపల సందడి

తాడికొండ: వరద ఉధృతికి తాడికొండ పెద్ద చెరువులోకి కొత్తనీరు వచ్చి చేరుతుండటంతో చేపల సందడిగా మారింది. సుమారు 700 పైచిలుకు విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువులో ప్రతి ఏటా చేపల పెంపకం జరుగుతుంది. గురువారం భారీగా వర్షం కురువడంతో ఎగువ నుంచి వచ్చిన వరద నీరు భారీగా చెరువుకు చేరింది. కొత్త నీరు ఎక్కువై పక్కనే ఉన్న పంట పొలాల్లోకి చేరడంతో చేపలు భారీగా పొలాల్లోకి వచ్చి పడ్డాయి. దీంతో జనం తండోపతండాలుగా వలలు, కర్రలతో కొట్టి చేపలను భారీగా పట్టుకొని అమ్ముకోవడంతో చెరువు వద్ద సందడి వాతావరణం ఏర్పడింది. వందలాది మంది జనం చేపలు కొనుగోలు చేసి శుభ్రం చేయించుకునేందుకు ఎగబడటంతో సందడిగా మారింది.



వలల్లో వేసుకొని చేపలను బయటకు తెస్తున్న స్థానికులు



చెరువు వద్ద చేపలు శుభ్రం చేయించుకుంటూ జనాల సందడి